**'వెంకటాద్రి' రావడానికింకా రెండు గంటల టైముంది. అంత ముందుగా స్టేషనుకు వచ్చి, బండి కోసం బడిగాపులు బడడం కొండ్రలావుగారి స్వభావానికి విరుద్ధం.**

**అరగంట ముందుగా బంట్రోతును స్టేషనుకు పంపడం, అతడు సీటును ఆక్రమించి తలగడతోను శాలువతోను, సుఖాసనం ఏర్పాటు చేసి పెట్టాక తానేమో కొద్దినిమిషాలు ముందుగా స్టేషనులో ప్రవేశించి కదల బోతుండగా బండెక్కడం– అదీ కొండ్రలావుగారి పద్ధతి.**

# దారితోడు

## మధురాంతకం రాజారాం


కొండ్రలావు గారి జీవితంలో ఓడల కాలం పోయి, యిలా బండ్లకాలం రావడానికి కారణమేమిటంటారేమో! మరేమీ విడ్డూరమైనది కాదులెండి. మామూలు కారణమే! అప్పుడేమో ఆయన రెవిన్యూ డిపార్టుమెంటులో గెజిటెడ్ ఆఫీసరు. ఇప్పుడు పదవీ విరమణ చేసిన మాజీ ప్రభుత్వోద్యోగి.

అయినా లేటుగా వస్తేనే గదా యిబ్బంది! ముందుగా రావడం వల్ల పెద్ద ప్రమాదమేమీ లేదు. ఎదొచ్చీ కాలాన్ని వేగించడమెలాగన్నదే ప్రశ్న. ఫరవా లేదు. యాభై అయిదేళ్ళే గడచిపోయాయి. రెండు గంటలు గడవ్వా?... కొండ్రలావు గారు వెయిటింగ్ హాల్లో ప్రవేశించి ఓ మూలగా సిమెంటు బెంచీ పైన కూర్చున్నారు. ఒకసారి పరిసరాల్ని కలయ పరికించారేమో, హాసలేశం ఒకటి ఆయన పెదవుల పైకి ప్రాకి రాబోయింది. తిరుపతి దేవాలయాల పట్నం గదా! రైల్వే స్టేషను కట్టడంలో సైతం ఎంతో కొంత దేవాలయ వాస్తువు తొంగి చూస్తోంది. విశాలమైన వెయిటింగు హాల్లో కొందరు యాత్రీకులు బిచాణాలు సర్దుకొని చల్లగా పవ్వళించేశారు. లగేజీ దొంతర్ల చుట్టూ కొందరు తిష్ట వేసుకుని కూచున్నారు. కొన్ని జంటలు కేళీవిలాసంగా బెంచీలను ఆక్రమించుకున్నాయి. పిల్లలు కొందరు కేరింతలు కొడుతూ స్తంభాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రవేశ ద్వారం దగ్గరి నుంచీ బుకింగు కౌంటర్లదాకా విస్తరించి వున్న హాల్లో నైతే పరిస్థితి మరింత గజిబిజిగా వుంది. అడుగు తీసి అడుగు వేయడానికైనా వీల్లేకుండా ఆ ఆవరణ జనంతో కిట కిట లాడిపోతూ వుంది. విల్లుప్పురం నుంచీ వచ్చే చిన్న రైలు ప్లాటుఫారంలో ఆగిందేమో 'ఏందీ కామూ! అదిమేగోదా! అదే పయ్యా! ఇన్నాంగో, ఉళంగెవా! కూప్పిట్టా కేక్కవిల్లయా?' లాంటి పలకరింపులతో దక్షిణాది జనం వుప్పెనలా, వరదలా గేట్లగుండా దూసుకొచ్చేస్తున్నారు. కటువైన సత్యం ఒకటి బోధ పడినట్టుగా కొండ్రలావు గారి ముఖం వెల వెల పోయింది. వివిధ వయోరూపాల, వివిధ వేషాల, వివిధ భాషల, వివిధ హావభావాల ఆ మహాజన సమూహం మధ్య తన ఒంటరి తనమేమిటో ఆయనకు స్ఫురించింది. ఇంతమందిలోనూ తనను పలకరించే వాడు లేడు. తెలిసిన ముఖం అసలే లేదు!

ఆమాట కొస్తే ఈ రైల్వేస్టేషన్లో మట్టుకే గాదు, తాను పుట్టి పెరిగి జీవించిన ప్రపంచంలో సైతం తనస్థితి యింతకంటే మెరుగ్గా లేదేమో! ఉద్యోగరీత్యా తానెన్నో ఊళ్ళు తిరగాడు. ఎందరో మనుషుల్ని కలుసుకున్నాడు. కానీ పరిచయాలని పెంపొందించుకోలేడు. అనుబంధాలను పెరగనివ్వలేదు. ఆత్మీయతల్ని నెలకొల్పుకోలేదు. నూటనాలుగు డిగ్రీల ఉద్యోగ జ్వరంలో నిత్యమూ, నిరంతరమూ సర్క్యులర్లు, మెమోలు, ఛార్జిషీట్లు, ఫైళ్ళు మొదలైనవాటిని గురించే పలవరిస్తూ వుండి పోయాడు. చివరకు తన జీవితాన్ని, మనసునూ కుటుంబ సభ్యులతో పంచుకునే ఓపరికంగూడా తనకు లేక పోయింది. తీరా శిక్ష విధించబడిన తర్వాతగానీ తన నేరమేమిటో, అది ఎంతటిదో తనకు తెలిసిరాలేదు. కొడుకులు నలుగురూ నాలుగు దిక్కుల్లో వుండిపోయారు. పెళ్లి గామందుకున్న తర్వాత, ఎక్స్‌ప్రెస్ బండ్లలో బయలుదేరినా ఇరవై నాలుగు గంటల్లోగానీ తన దగ్గరకు రాలేనంత దూరంలో వాళ్ళు నివసిస్తున్నారు. రెండేళ్ళ క్రిందట హఠాత్తుగా కనుమరుగై పోయిన అర్ధాంగి అంతకంటే కఠిన శిక్షకే తనను గురిచేసింది. ఏ విధంగా చూచినా తాను బరాబయలు మైదానంలో ఒంటరి చెట్టులా మిగిలి పోయాడు. లేకంటే ఈ ఒంటరి చెట్టులో ఒకే ఒక చిటారు కొమ్మ మాత్రం పచ్చగా రెపరెపలాడుతూవుంది. అదైనా ఎంతో కాలం తనను అంటిపెట్టుకుని వుండదు. తీసికెళ్ళి దాన్ని యింకొక

చెట్టుకు అంటు గట్టడం సాంప్రదాయం. అంత పనీ జరిగితే తాను అసలు సిసలు మోళ్ళిడులా మిగిలి పోవడం ఖాయం. అయినా ఆపని మాత్రం చేయక తప్పదు.

ఆ అంటుగట్టే పనికిగూడా ముహూర్తం నిర్ణయమై పోయింది. అయితే అది ఒక చేతిమీదుగా జరిగే పనికాదు. "ఒరే



అబ్బాయిలూ! నేను చేయవలసింది చేశాను. ఇప్పుడిక మీరు మీ కుటుంబాలతో తరలి రావాలి. ముందుండి మన కుటుంబంలోని ఈ ఆఖరి శుభకార్యాన్ని మీ అజమాయిషీ క్రింద జరిపించాలి" అని ఆయన కుమారుల కందరికీ వర్తమానం తెలియజేశాడు. ప్రత్యుత్తరంగా పెద్ద అబ్బాయి దగ్గర నుంచీ అయిదువేల రూపాయలకొక చెక్కు వచ్చింది. రెండోవాడు రెండు రోజుల ముందుగా వచ్చి పెళ్ళికి హాజరుకాగలనంటూ భరోసాయిచ్చి, తానొక నెక్‌లెస్‌ను చెల్లెలికి కానుకగా యివ్వగలనని తెల్పుకున్నాడు. మూడోవాడికి ఆఫీసు ఇన్‌స్పెక్షన్ సందర్భంలో ఊపిరి త్రిప్పుకోడం గూడా సాధ్యం కావడం లేదట! 'ఏం చెయ్యమంటారు నాన్నా! నేను రావడం సాధ్యం కాదేమో!' అని సందేహం వెలిబుచ్చాడు. నాలుగోవాడి విషయం మరింత తలక్రిందులుగా వుంది. ఏదో ట్రెయినింగ్ నిమిత్తం వాడు డార్జిలింగ్ వెళ్ళి నెల రోజులు మాత్రమే అయిందట! 'నేను యింత దూరం ఒంటరిగా ఎలా రానండీ మామగారు!' అంటూ చిన్న కోడలు ఉత్తరం రాసింది.

మునుపటికొక పెద్ద మనిషి ఊళ్ళో ఏ శుభకార్యం జరిగినా తనకు బదులుగా ఓ దుడ్డుకర్ర పంపేవాడట! చివరకు తన యింట పెళ్ళి పెట్టుకొనేటప్పటికి బందెడు దుడ్డుకర్రలు అతిధి సత్తములకు బదులుగా ఆయన యింటికి చేరుకున్నాయట! ఆ కథ గుర్తుకొచ్చి కొండ్రావుగారు దిక్కు

మొగం పెట్టేశారు. 'నా సమస్య డబ్బు
గురించి కాదర్రా బాబులూ! మనుషుల
గురించి! మంచికైనా, చెడుకైనా మ
షులు ముఖ్యం' అంటూ బ్రహ్మాండం బ
లయ్యేటట్టు గొంతెత్తి చెప్పాలని పించిం
ఎవరో ఫక్కున నవ్వినట్లై, ఆయన త
వద్దారు. 'ఆ మాట చెప్పవలసింది
అబ్బాయిలకు కాదయ్యా కొండ్రా
నీకు నువ్వే చెప్పుకోవాలి' అని ఎవ
చెవిలో చెప్పి నట్టయింది.

పెళ్ళికింకా పదిహేను రోజులై
గడువు లేదు. తిరుపతికి చేరువుగా 'నగ
అన్న చిన్న బస్తీలో కొండ్రావుగ
కొక మరదలుంది. కొంచెం ఆసరాకు
వుంటుందన్న ఉద్దేశంతో ఆమెను వెం
బెట్టుకునివెళ్ళాలని ఆయన తిరుపతి ప్ర
ణం పెట్టుకున్నారు. పాపం, ఆమెదే
తప్పు లేదు. కోడలు కను పొద్దులుగా వ
డడం వల్ల ఆమె యిల్లు దాటి రాలే
పరిస్థితి 'నాకు మాత్రం అమ్మాయిని పె
కూతురుగా చెయ్యాలని లేదా బావా! కోడ
తీర్థమాడగానే బయల్దేరి వస్తాను' అంటూ
హామీ యిచ్చింది. కానీ ప్రసవం అ
దానికి బాహ్యమైన ప్రాపంచిక కార
లతో నిమిత్తం వుండదు గదా! అంద
నవమాసాలునిండాలి. అవి నిండేదెప్పుడ
కొండ్రావుగారు ఒకసారి వేడిగానిట్టూ
'సరేనమ్మా! అటాగే బయల్దేరిరా' 
తిరుగు దారి పట్టేశారు.

గంట రెండు కావచ్చింది. 'తిరు
నుంచీ ధర్మవరం, గుంతకల్లు, ద్రో
చలం మీదుగా సికింద్రాబాదు వెళ్ళ వె
టాద్రి ఎక్స్‌ప్రెస్ రెండో నంబరు ప్లా
ఫారంపైకి వచ్చి నిలిచింది' అం
మైక్‌లో ప్రకటన వినిపించింది. కొ
ండ్రావుగారు నెమ్మదిగా లేచి వెళ్ళి, ఆన
కంపార్ట్ మెంటులో కిటికి ప్రక్క

ఒక పీటు చూచుకోగలిగారు గమ్యస్థానం చేరుకునేటప్పటికి ఎంతలేదన్నా ఎనిమిది కావచ్చు. చేతిలో ఒక పత్రిక వుండడం మం:దనుకుంటూ ఫ్లాట్‌ఫారం పైకి చూచారు. అలా చూచిన క్షణంలో ఒక ఆశ్చర్యవీచిక ఆయన ముఖంలో గిర్రుగిర్రున సుళ్లు తిరిగింది. 'ఓరి! ముండాకొడకా! ఎక్కడ మునిగి, ఎక్కడ తేలావురా నాగులయ్యా! నువ్విక్కడున్నావా!' అనుకున్నాడు.

కొండ దిగి వచ్చాడేమో. నున్నటి బోడిగుండుకు తువ్వాలు చుట్టుకున్నాడు నాగులయ్య. కీపాసు పెట్టి మోకాళ్ళదాకా చుట్టుకున్న పంచ కట్టుపైన అరచేతుల పొట్టి చొక్కా తొడుక్కున్నాడు. మెడలో తాయెత్తు. ముంజేతికి రాగి కడియం. రిటైర్మెంటు వాడిపైన తన ప్రభావమేమీ చూపినట్టులేదు నాటికీ నేటికీ పిడిగుండల్లే వున్నాడు. కడప జిల్లాలో ఎక్కడో ఒక కుగ్రామం వీడిది! బహూశా స్వస్థలానికితిరిగి వెళ్తున్నాడేమో!

'నాగులయ్యా!'అని పిలవాలనిపించింది. కానీ ముడివడ్డ పెదవులు విడివడ లేదు. పిలుపు గొంతుకలోనే కొట్టు మిట్టాడింది. కొన్ని పాత అనుభవాలు వాడికీ తనకూ మధ్య చేదు జ్ఞాపకాలుగా వుండిపోయాయి మరి! వాటిని ఛేదించుకొని తాను అవతలకి వెళ్ళడం గానీ, వాడు ఈవలికి రావడం గానీ సాధ్యం గాక పోవచ్చు....

హోదాలో తేడా వున్నప్పటికీ, ఉద్యోగానికి సంబంధించి కొండ్రావు గారిని సమాంతర రేఖలా వెంబడిస్తూ వచ్చిన వాడు నాగులయ్య. పులివెందల ప్రాంతాన్ని పోతుగడ్డ అంటారు. అక్కడి నుంచీ వచ్చాడేమో, తలపైన పిడుగు పడుతుందన్నా చెక్కు చెదరని స్వభావం వాడిది! వాడు వాచ్‌మేన్‌గా వుండగా ఒక సారి జమ్మలమడుగు తాలూకాఫీసు నుంచీ మూడు కుర్చీలు గల్లంతై పోయాయి. రెండు వందల రూపాయలు జరిమానా వేస్తే, మారు మాట లేకుండా చెల్లించేశాడు. ప్యూనుగా ప్రమోషన్ అందుకున్న తర్వాత వాడినొక సారి యింటికి కావలిగా పెట్టి తాను క్యాంపు వెళ్ళి వచ్చేటప్పటికి, పూటుగా తాగి చింత మొద్దులా వసారాలో పడి వున్నాడు. జీపు డ్రయివరు లేపబోతే 'పో ...ర్యాపో! ఎప్పుడంటే అప్పుడొస్తావా! బుద్ధుండక్కర్లా!' అని కసురుకున్నాడు. ఒక బకెట్టు నీళ్లు తెప్పించి ముఖాన పోయిస్తే, అప్పుడు లేచి నిల్చుని 'తప్పయిపోయింది సామీ! మన్నించాలి!' అంటూ పళ్లికిలించాడు. ఇంకొకసారి తాను రాజంపేటలో సబ్‌కలెక్టరుగా వుండగా వీడు మూడురోజులసెలవులోస్వగ్రామానికివెళ్లి తీరిగ్గా వారం రోజుల తర్వాత తిరిగి వచ్చాడు. ఒక ఇంక్రిమెంటు కట్ చేసినట్టు కాగితం చేతికిప్పిస్తే, వాడికి చీమ కుట్టినట్టయినా లేదు. ఇవన్నీ గాకుండా ముఖం వాచేటట్టుగా తాను వాణ్ణి చెడా మడా తిట్టిన సందర్భాలెన్నో!

కాల్చుతున్న బీడీని పూర్తిగా వూదిపారేసి, ఏదో జ్ఞాపకం వచ్చినట్టు నాగులయ్య తటాలున లేచి నిల్చున్నాడు. చటుక్కున బండి వైపు తిరిగే సరికి కంపార్టుమెంటు కిటికీ దగ్గర తెలిసిన ముఖం ఒకటి కనిపించినట్టయింది. కొద్ది క్షణాలు వాడు తన కళ్లను తానే నమ్మినట్టులేదు. తాను లోనైంది భ్రమ కాదని రూఢి చేసుకున్నాక రెండంగల్లో బండి దగ్గర కొచ్చి పడ్డాడు. "దండాలండీ అయగారూ! ఏలినోరు ఎంకటా చలపతిలా కనిపించినారు. బాగుండారా? ఆ మద్దెన అమ్మగారు పోయినారని వింటిన్లెండి. మనసు మనసులో లేకుండా పోయింది. బంగారు తల్లి! చల్లటి చేతుల్తో నాకెన్ని సాప్లు అన్నం పెట్టిందో!"

తన కళ్ళల్లో నిలిచినందుకై వుందదు గానీ, అయ్యగారి ముఖంలో దైన్యమెక్కడ కనిపించి పోతుందోనని నాగులయ్య తల క్రిందికి దించుకున్నాడు. "ఎప్పటికప్పుడు సంగతులన్నీ తెలుసుకుంటూనే వున్నాన్లెండి అయిగారూ! రిటయరైనాక తమరు కదిరి వొచ్చి చేరిపోయినారంట గదండీ!"

అబ్బాయిల వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాక నాగులయ్య అమ్మాయినిగురించి ప్రస్తావించాడు. "అయగారూ! రుక్కమ్మగారు బాగుండారా? పెండ్లిజరిపించేసినారా అండీ?"

"లేదురా! సంబంధం కుదిరింది, రెండు వారాల్లోనే వుంది ముహూర్తం, దగ్గర్లో స్వంతమనుషులెవరూ లేకపోయిరి. అందుకనే యిలా తిరుగుతున్నా ...."

"అయ గారూ! మీరేం చింత బెట్టుకోబాకండి! చిన్నమ్మగారి పెండ్లి లచ్చనంగా జరిగి పోతుంది"


బండి బయల్దేర బోతున్నందుకు సూచనగా గంట మ్రోగింది.


"ఒరే నాగులయ్యా!"

"అయగారూ!"

"ఏంలేదులేరా! నీకు పెండ్లి పత్రిక..."

బండి కదిలింది. నాగులయ్య రెండు చేతులూ కిటికీ దగ్గరకు సాచాడు. ఇంక్రి






మెంటు కత్తిరించిన చేతులతోనే నాగులయ్య చేతిలో పెండ్లి పత్రికను పెట్టారు కొండ్రలావుగారు.

నాలుగురోజుల తర్వాత ఒకనాటి ఉదయం కదిరిలో లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం వెనుకవైపున వున్న ఒక పాతకాలపు మహిదీలో గంట యింకా ఆరుగాక ముందే తెల్లవారిపోయింది. ఉలిక్కి పడ్డట్టుగా కొండ్రలావుగారు మేలుకొన్నారు. హాల్లోనుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"ఏం మాటల్లే చిన్నమ్మా! నీకు పెండ్లని తెలియకపోతె చెప్పలేనుగానీ. తెలిసినాక నేను రాకుండా వుంటానా! ఇప్పుడైతే పెద్దదానివై పోయినావుగానీ. యింతప్పటినుంచీ నిన్నెత్తుకొని పెంచిన చేతులు గదంటమ్మా యివి!"

"అవునుగానీ. నీకుమాత్రం వీలుండొద్దా నాగులయ్యా!"

"నాకు వీలా! నన్నెవుడాపుతాడమ్మా నీ పిచ్చి గానీ! కొడుకులూ. కూతుళ్లూ వున్నారనుకో! ఉంటేమాత్రం? నాకొకరి పెట్టుపోతలు అక్కర్లేదే! నన్ను నమ్ముకొని ఓ ముసల్దుందనుకో. నా కొచ్చే పించను డబ్బులు చాలు మాకు.... అప్పరేగానీ. ఇదేందమ్మా పెండ్లిల్లు ఈ మాదిరిగా వుంది? చెంజి పాళెగాడి నగిరిలా వుంటే సరిపోయిందా? దీనికి సున్నం కొట్టొద్దా? రంగులెయ్యొద్దా? తలుపుకు. ద్వారబంధాలకు బొట్లు పెట్టొద్దా? సర్లే. ఆ పనులన్నీ రేపట్నుంచీ చూసుకుందాం. ఇప్పుడు నువ్వు ఏ మూల్లోనైనా పారా పలుగూ వుంటే సైకితియ్. ఇంటి చుట్టూ పల్లేరూ, పిచ్చి మొక్కలూ బలిసి పోయి వున్నాయి. ఎండెక్కేటప్పటికి నీటుగా చెక్కేస్తాను."

"ఒరే ఒరే నాగులయ్యా! ఎప్పుడొచ్చావురా నువ్వు! లేడికి లేచిందే పరుగనుకుంటే ఎలాగురా? ముఖం కడుక్కొని ముందుగా నాష్టా సంగతి చూడు...." గది గుమ్మంలోకి వచ్చిన కొండ్రలావు గారు నాగులయ్యను పరామర్శించారు.

మొత్తానికి నాగులయ్య రాకతో ఆ యింటికి పెళ్లికళ వచ్చేసింది. బజార్లో సున్నం ఎక్కడ దొరుకుతుంది? దాన్ని యింటికి చేర్చుకోడానికున్న వాహన సదుపాయాలేమిటి? ఆ సున్నాన్ని విడగబోయటం ఎలాగ? గోడలకు వెల్లవేసే మనుషులెక్కడ దొరుకుతారు? వాళ్లకా పని చేసినందుకు ఏ మాత్రం ముట్టచెప్పవలసి వుంటుంది? ఇలా కొండ్రలావు గారికి అంతుబట్టని ఎన్నో సమస్యల్ని నాగులయ్య చిటికెలో తేల్చి పారేశాడు. బండిలో తుమ్మదుంగల్ని తోలుకొచ్చాడు. వాటిని చీల్పించి. ఎండలో వేయించాడు. నాలుగు చోట్ల వాకబు చేసి మేలు రకం బియ్యం తీసుకొచ్చాడు. రాళ్లేర్పించి. బస్తాల్లో పోసి కుట్టించాడు. మిరపకాయలు. ధనియాలు. పసుపులాంటి వాటిని పొడి చేయించుకొచ్చి డబ్బాల్లో నింపాడు. సన్నాయి మేళగాళ్లని. వంట బ్రాహ్మల్ని. పందిరి జోడించేవాళ్లని తోలుకొచ్చి కొండ్రలావు గారితో భేటీ చేయించాడు.

పెళ్లిసగ్గరకొచ్చే సరికి బంధువులొకరుగా. యిద్దరుగా. చిన్న చిన్న బృందాలుగా రాసాగారు. కానీ వాళ్లకు చక్కబెట్ట వలసిన పెళ్లిపనులేవీ లేకపోయాయి. ఆఖరుకు కొండ్రలావు గారు సైతం సోఫాలో చేరగిలబడి "పనులన్నీ అయిపోయినట్టేనట్రా నాగులయ్యా? ఇంకేమీ బాకీ లేదా?" అనవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఒక రోజు ముందుగా పెళ్లిసంబరాలన్నింటినీ కన్యకాపరమేశ్వరి సత్రానికి చేరవేయించాడు నాగులయ్య. యజుడు నిక్షేపాన్ని కాపెట్టుకున్నట్టుగా అక్కడి స్టోరురూం తాళాలను తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. మధ్యాహ్నానికల్లా స్వీట్లు సిద్ధమైపోయాయి. ఆ పైన వంట పనులు ప్రారంభమయ్యాయి. సాయం కాలానికి మగ పెళ్లివాళ్లొచ్చి. వాళ్ల విడిదిలో దిగిపోయారు. దీపాలు వెలిగాయి. బాజాలు మ్రోగాయి. ఎనిమిదింటికే విందువర్ధన మొదలైంది. పది పదకొండుదాకా అయిదారు బంతులు లేచాయి. బంధు మిత్రులు ఎక్కడి వారక్కడే పడుకున్నారు. రెండు గంటలప్పుడు కొండ్రలావుగారికి మెలకువ వచ్చింది బాత్‌రూం వైపు వెళ్తూ అయి. తొంగి చూశాడు. నాగులయ్య ఒంటరిగా గోతాం పట్టాపైన కూచుని ప్లాస్టిక్ సంచుల్లోకి ఫల పుష్ప తాంబూలాలు నింపుతున్నాడు.

"ఏమిట్రా నాగులయ్యా! నువ్వింకా పడుకోలేదా?" అన్నారు కొండ్రలావు గారు.

"నిద్రకేముందిలెండి అయగారు! రేపట్నుంచీ యిరవైనాలుగ్గంటలూ నిద్రపోయినా మనల్నడిగేదెవురు?"

తెల్లవారు జామున సూత్రధారణ సవ్యంగా జరిగి పోయింది.

ఉపాహారాలు ముగిసిన తర్వాత క్రమక్రమంగా సత్రం ఖాళీ అయిపోసాగింది. మిగిలినబంధువులు కూడా ప్రయాణ సన్నాహాల్లో వున్నారు.

పొద్దు పడమటికి వాలింది. అంపకాలు. అప్పగింతలూ జరుగుతున్నాయి. ఏ సందులో నుంచో పెళ్ళికూతురు నాగు

లయ్యకు కబురు పెట్టింది. అతడు వెళ్ళి ఎదుటనిల్చునేసరికి గుండెల్లోని దుఃఖమంతా ఎగదట్టిందేమో, ఆమె గొంతుక రుద్ధమై పోయింది. అతడి చేతులు రెండూ గట్టిగా పట్టుకుంటూ "నాగులయ్యా! నాన్నగారికి నువ్వే దిక్కు" అంటూ భోరున ఏడ్చేసింది.

"నీకా చింతేమీ వొద్దులే చిన్నమ్మా! నేనెప్పుడూ పిలిస్తే పలికేటంత దూరంలో వుంటాననుకో! ఇంకా మాటాడితే నా పెళ్ళాన్నిగూడాతీసుకొచ్చి ఈ యింట్లోనే ఒక పక్కగా వుండిపోతాను. నీ కాపురంలో నువ్వు సంతోషంగా వుండాల. అంతే మాక్కావల్సింది...."

మళ్ళీ పదిరోజులు గడచి పోయాయి పెళ్ళికి వచ్చిన కొడుకులు భార్యాబిడ్డలతో బాటుగా వెళ్ళిపోయారు. కొమ్మలన్నీ పోగొట్టుకున్న బోదెలా కొండ్రావు గారు బోసిగా మిగిలి పోయారు. ముఖంలో మునుపటి జీవకళ లేదు. బహూశా మర మనిషి అనేది యిలాగే వుంటుందేమో!

**వాస్తవం**

కలలు ఎన్నో రకాలు
సుఖాలు, దుఃఖాలు కలగలిపి,
వస్తుంటాయి ఎన్నోసార్లు!
కళ్ళు తెరిస్తే కరిగిపోతాయి!
వాస్తవ జీవితంలో అలా కాదు
వాస్తవాలు జీవితానికే అనుభవ
పాఠాల్ని నేర్పిస్తాయి!
ఒడుదుడుకుల్ని తట్టుకునేలా
కళ్ళు తెరిపించి
నిజమని నిరూపిస్తాయి.

—'వెంకట్'&రావ్

'స్విచ్'నొక్కితేగానీ ఈయనలోను కదలిక లేదు. 'అయగారూ! నీళ్ళు కాగినాయండీ. ఆయన స్నానం చేస్తారు.' 'అయగారూ! చలవ బట్టలిక్కడున్నాయండీ. ఆయన దుస్తులు మార్చుకుంటారు. 'అయగారూ! భోజనం వడ్డించేసినానండీ' ఆయనభోజనం చేస్తారు. పొద్దు పోయిన తర్వాత నాగులయ్య గనుక దీపం వెయ్యకపోతే ఆయన తన గదిలో చీకటిలోనే వుండి పోతారు.


'మళ్ళీ ఈయన మామూలు మనిషి అయ్యేదెప్పుడో!' అనుకున్నాడు నాగులయ్య.

ఒక నాటి దీపదీపాల వేళ కొండ్రావుగారు నాగులయ్యను పిలిచారు. "ఒరే నాగులయ్యా! అందరికీ యినాములిచ్చేశాను గానీ, నీకేమీ యివ్వలేదు. సరే, యినాము సంగతి తర్వాత చూద్దాంలే! పాపం, పెండ్లి పన్ల మూలంగా బాగా దప్పిపోయి వుంటావు. ఇదిగో డబ్బు. ఒకసారి కొట్టువైపు వెళ్ళిరా!" అన్నారు.


"అయ గారూ! దండాలండీ! మీరిస్తే వద్దనడానికి నోరాడదు గానీ, ఆ పనికి మాత్రం తీసుకోనండీ! బకెట్టు నీళ్ల నా ముఖం పైన దిమ్మరించినాక మళ్లీ ఆ పని జోలికెప్పుడూ పోలేదండీ!" అన్నాడు నాగులయ్య.


మా వినియోగదారులకు దీపావళి శుభాకాంక్షలు!

అందరికి అందుబాటులో ప్రత్యేకమైన ఉత్తమకోవలో మైనపువత్తుల తయారీలో మన్ననలు పొందిన "నాగా" బ్రాండ్ కొవ్వొత్తులను సదా వాడండి. అన్ని సైజులలో లభించును.



## నాగా కాండిల్ వర్క్స (SSI)



9/289 కాశీరావు తోట

**కడప 516 001**

స్టాకిస్టులు :

1. షాహంజరిమల్ భవర్‌లాల్ 13/700 బి. కె. యం. స్ట్రీట్. కడప.
2. షాకిరణ్ జఫీవర్‌చంద్, రహంతుల్లా వీధి, కడప.
3. కటారియా జనరల్ స్టోర్స్. రహంతుల్లా వీధి. కడప.